క్లుప్తంగా

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం



పెదకొత్తూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్, పార్టీ నాయకులు

కరప: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పార్టీలకు అతీతంగా పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పెదకొత్తూరు సర్పంచ్ చింతా నాగలక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పెదకొత్తూరులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, ఇతర గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించి, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని నాగలక్ష్మి ఓటర్లను అభ్యర్థించారు.

తొలి రోజు మూడు నామినేషన్ల దాఖలు

కాకినాడ: మే 13వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సిటీ నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజు ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. టేకుమూడి శ్రీనివాసరావు, మట్టా వెంకటేశ్వరరావు, వినికొండ వెంకటేశ్వరరావు మూడేసి సెట్ల నామినేషన్లను ఆర్వోకు అందజేశారు.

25 వరకు స్వీకరణ

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు రోజులు మినహా 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు శారదాదేవి ఆలయం సమీపంలో తన కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు, గుర్తులు, ఇతర సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ కూడా అందుబాటులో ఉందన్నారు. అలాగే నామినేషన్లు వేసే ప్రాంతానికి 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా రాజకీయ పార్టీలు నిబంధనలను కచ్చితంగా పాటించి ఎన్నికలు సజావుగా నిర్వహించేలా సహకరించాలని సూచించారు.

రూరల్ నియోజకవర్గంలో ఒకటి..

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ ఉదయం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. తొలి రోజు ఒక నామినేషన్ దాఖలైనట్టు ఆయన తెలియజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పితాని అన్నవరం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు విజయ్‌ప్రసాద్, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ వలంటీర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. నాలుగున్నర ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో కీలకంగా పనిచేసిన వలంటీర్లు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో తిమ్మాపురంలో సుమారు 30 మంది వలంటీర్లు మండల పరిషత్ కార్యాలయంలో తమ పదవులకు గురువారం రాజీనామా చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ టీడీపీ, జనసేన వలంటీర్లపై భౌతిక దాడులతో పాటు తీవ్ర పదజాలంతో దూషిస్తున్నందున మనస్తాపంతోను, వ్యక్తిగత కారణాలతోను పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేశామని తెలియజేశారు.

కలెక్టర్‌ను కలసిన వ్యయ పరిశీలకులు

కాకినాడ సిటీ: పార్లమెంటరీ నియోజకవర్గానికి కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు సాధిక్ అహ్మద్; తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు యోగేష్ కుమార్; పెద్దాపురం, కాకినాడ సిటీ, జగ్గంపేట నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఎ.ఆసిఫ్‌లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్‌ను కలెక్టరేట్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలసి పలు అంశాలపై చర్చించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సాధిక్ అహ్మద్, యోగేష్‌కుమార్, ఎ.ఆసిఫ్ గురువారం కలెక్టరేట్ స్పందన హాలులోని ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్‌తో కలిసి పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో ఉన్న 1950 కాల్ సెంటర్, హెల్ప్‌డెస్క్, సువిధ, చెక్‌పోస్టుల వెబ్ కాస్టింగ్ తదితర విభాగాల పని తీరును కలెక్టర్ నివాస్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి తిప్పేనాయక్, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి డి.భారతి, సమాచారశాఖ డీడీ డి. నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దారులూ అచ్చంపేట వైపే..

- నేడు వైఎస్సార్ సీపీ 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం జగన్
- జనసంద్రం కానున్న సభా ప్రాంగణం





కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద మేమంతా సిద్ధం బహిరంగ సభా వేదిక, సిద్ధమైన సభా ప్రాంగణం

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోరులో ఒంటరిగా సింహంలా ప్రజల ముందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బహిరంగ సభలతో ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంక్షేమ రథసారథి శుక్రవారం కాకినాడ వస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సిద్ధం బహిరంగ సభను ఈ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నారు. తిమ్మాపురం గ్రామ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద ఏడీబీ రోడ్డును ఆనుకుని విశాలమైన ఖాళీ స్థలంలో ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం జగన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటరు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పర్యవేక్షణలో సిద్ధం సభ వేదిక, ర్యాంపు, ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చే అశేష ప్రజానికానికి వచ్చే ఎన్నికలను ఉద్దేశించి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో సీఎం జగన్ ప్రసంగించనున్నారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రజల నుంచి ఉద్దేశించి చేయనున్న ప్రసంగం కోసం జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సిద్ధం బహిరంగ సభ విజయవంతం కోసం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యవేక్షణలో జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అశేషంగా జనవాహిని తరలివస్తుందని అంచనా వేస్తున్నారు. బహిరంగ సభ సొంత నియోజకవర్గంలో జరుగుతుండడంతో ఎమ్మెల్యే కన్నబాబు జన సమీకరణకు భారీగా బస్సులు ఏర్పాటు చేశారు. సుమారు 300 బస్సులతో పాటు కార్లు, ఆటోలు, బైక్‌లపై జనాలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల వారికి బస్సులను కేటాయించారు. సిద్ధం సభకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా పోలీసు యంత్రాంగం పార్కింగ్ ఏర్పాట్లు చేసింది.

జగనన్న సభకు మేమంతా సిద్ధం

- 150 బస్సుల్లో తరలుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కాకినాడ: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ సభకు 'మేమంతా సిద్ధం' అంటూ ఇక్కడి పార్టీ కేడర్ సమాయత్తమైంది. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అచ్చంపేట జంక్షన్‌లో జరిగే సభకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారనే సమాచారం ఇక్కడి కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. ఇప్పటికే ఇంటింటి ప్రచారంతో జోరుగా ఉన్న కాకినాడ సిటీ కేడర్‌కు అధినేత ఈ ప్రాంతానికి రానున్నారనే సమాచారం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఓ వైపు మండుటెండలతో అల్లాడుతున్నా అధినేత సభకు హాజరుకావాలన్న ఉత్సాహం ఇక్కడి కేడర్‌లో కనిపిస్తోంది. ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందన నేపథ్యంలో అధినేత రాక పార్టీలో మరింత ఉత్తేజం నెలకొంటుందని స్థానిక నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్ అచ్చంపేటలో జరుగుతున్న సభకు నగర నలువైపుల నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలన్న ఉత్సాహం కేడర్‌లో కనిపిస్తోంది.

150 బస్సులు సిద్ధం..

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సుమారు 150 బస్సులను సిద్ధం చేస్తున్నారు. సీఎం సభకు హాజరుకావాలని పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తోన్న నేపథ్యంలో ఏఏ ప్రాంతాల నుంచి బస్సులు వెళ్లాలనే అంశాలపై పార్టీ ముఖ్యనేతలతో ఆయన సమీక్షించారు. బస్సులతో పాటు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో కూడా కేడర్ తరలి వెళ్లనున్నారు. వీరందరికీ అవసరమైన ఏర్పాట్లను ఆయన పూర్తి చేశారు.

జగన్ రాకతో ఉత్తేజం



ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా పర్యటన కేడర్‌లో మరింత ఉత్తేజాన్ని నింపుతోంది. సీఎం ఇచ్చే సందేశం కోసం ఈ ప్రాంత ప్రజలు, పార్టీ శ్రేణులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సీఎం సభ ఎప్పుడు జరుగుతుందా అనే ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రచారంలో ముందున్న నేపథ్యంలో సీఎం రాక మరింత ఊపునిస్తోందనడంలో సందేహం లేదు.

చలమలశెట్టి సునీల్, కాకినాడ ఎంపీ అభ్యర్థి

కేడర్‌లో జోష్ నింపనున్న సీఎం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ ప్రాంత పర్యటనకు వస్తున్నారన్న సమాచారం పార్టీ కేడర్‌లో జోష్ నింపింది. ఆయన సభకు హాజరై జగన్ పూరించే ఎన్నికల శంఖారావాన్ని విని ప్రచారంలో దూసుకుపోవాలని పార్టీ శ్రేణులంతా ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. జగన్ ప్రజల్లో తిరగకుండా నియంత్రించేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని మరింత సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ సభ ఉపయోగపడుతుంది అనడంలో సందేహం లేదు.

ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే

సిద్ధం సభకు తరలిరండి



సర్పవరం సమావేశంలో నినాదాలు చేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేతలు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొననున్న సిద్ధం బహిరంగ సభకు గ్రామస్తులు భారీగా తరలిరావాలని సర్పవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు కోరారు. గ్రామంలో గురువారం పుల్ల చందు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సీఎం సిద్ధం సభను విజయంతం చేసేందుకు జన సమీకరణపై సమాలోచనలు చేశారు.

ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ

కరప: స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మండలం గురజనాపల్లిలో గురువారం పర్యటించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తంచేశారు. గురజనాపల్లికి చెందిన బెజవాడ వెంకటరావు ఇటీవల మరణించగా అతని కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెజవాడ నూకరాజు(బాబ్జీ)ని, ఇతర కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బినీడి పాపారావు, మామిడాల బాబీ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వేసవి శిక్షణ తరగతులు

బోట్‌క్లబ్: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు మేరకు గాంధీనగర్ చిల్డ్రన్‌పార్కు ఆవరణలోని బాలభవన్‌లో ఈ నెల 24 నుంచి జూన్ 6 వరకూ వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బాలభవన్ పర్యవేక్షకురాలు శారద గురువారం విలేకర్లకు తెలిపారు. శిక్షణ తరగతులు ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకూ జరుగుతాయన్నారు. గాత్ర సంగీతం, వయోలిన్, మృదంగం, కరాటే, తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలకు చేరువగా ప్రచారం చేయండి





పార్టీలో చేరిన 43, 19వ డివిజన్ల కార్యకర్తలతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- పార్టీ శ్రేణులకు ద్వారంపూడి పిలుపు
- పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరికలు

కాకినాడ: ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువై చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్థమయ్యేలా వివరించాలని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన పార్టీల తరఫున వివిధ డివిజన్లలో క్రియాశీలకంగా పనిచేస్తున్న అనేక మంది నాయకులు, కార్యకర్తలు గురువారం ద్వారంపూడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేశామని, వాస్తవాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు.

43వ డివిజన్ నుంచి చేరికలు

స్థానిక 43వ డివిజన్ కాల్వగట్టు ప్రాంతానికి చెందిన దాదాపు 60 కుటుంబాలకు చెందిన సుమారు 150 మంది మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ద్వారంపూడి సమక్షంలో పార్టీలో చేరారు. తెలుగుదేశం, జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు కప్పి ఆహ్వానించారు. తమ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే ద్వారంపూడి ఎంతో సహకరించారని, అందువల్లే ఆయనకు సంఘీభావం తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

19వ డివిజన్ నుంచి..

స్థానిక 19వ డివిజన్‌కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక నాయకుడు రాజు ఆధ్వర్యంలో వెంకటలక్ష్మి, గంగ, శేషారత్నం, సక్కుబాయితోపాటు దాదాపు 50 మంది పార్టీలో చేరేందుకు ముందుకు రాగా వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీలోకి ఆహ్వానించారు. తమ డివిజన్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు స్పష్టం చేశారు.

ద్వారంపూడిని మరోసారి ఆశీర్వదించండి

- సతీమణి మహాలక్ష్మి.. తనయలు ప్రణీత, అంజని
- ఐదో డివిజన్‌లో విస్తృత ప్రచారం



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ద్వారంపూడి కుమార్తెలు ప్రణీత, అంజని

కాకినాడ: నిరంతరం ప్రజాసేవకే అంకితమై ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన తన భర్త ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి సతీమణి మహాలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ఐదో డివిజన్ పరిధిలోని మాధవనగర్ ప్రాంతంలో ఆమె, అదే డివిజన్‌లో పాత ఎస్పీ కార్యాలయం ప్రాంతంలో ద్వారంపూడి తనయలు డాక్టర్ అంజని, డాక్టర్ ప్రణీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను స్వయంగా కలసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గడచిన ఐదేళ్లుగా కాకినాడ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసి, కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడంలో ద్వారంపూడి చేసిన కృషిని వారు ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు వివరించారు. నిరంతరం ప్రజల మధ్య ఉండే తన భర్తకు విజయాన్ని అందించడం ద్వారా నగరాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని మహాలక్ష్మి ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలను అందుకున్నామని, మా మద్దతు మీకేనంటూ ప్రజలు సంఘీభావం తెలిపారు. మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత అధ్యక్షతన మహాలక్ష్మి చేసిన ప్రచారంలో మరో మాజీ కార్పొరేటర్ మేడిశెట్టి రమణ, స్థానిక నాయకులు శ్రీధర్, అనిల్, మాచారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ద్వారంపూడి తనయలు చేసిన ప్రచారంలో కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మనసున్న నేతకు ముదిమి వందనం



ప్రచార ఆటోపై ఉన్న సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు ఫొటోలకు నమస్కరిస్తున్న వృద్ధ దంపతులు

కరప: ఆటోకు వృద్ధ దంపతులు నమస్కారం పెడుతున్నారేమిటని అనుకుంటున్నారా? ఆటోలో ఎవరినైనా చూసి నమస్కరిస్తున్నారని అనుకుంటున్నారా? అయితే పొరపాటు పడినట్టే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సంక్షేమ పథకాలతో తమను ఆదుకుంటున్నారన్న అభిమానంతో నమస్కారంతో తమ సంస్కారాన్ని చాటుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా కరప మండలం పెదకొత్తూరు శివారు చినకొత్తూరు గ్రామంలోని ఎస్సీ వీధిలోకి గురువారం వైఎస్సార్ సీపీ ప్రచార ఆటో వచ్చింది. ఆ ఆటో పైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు ఫొటోలు చెరో వైపు, మధ్యన ఫ్యాన్ గుర్తుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మైక్‌తో ఆటోలో ఎన్నికల ప్రచారం చేస్తున్న క్రమంలో అక్కడే ఉన్న వృద్ధ దంపతులు అంబటి శ్రీరాములు, మణి జగన్, కన్నబాబు ఫొటోలు చూసి దణ్ణం పెట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆస్తిపాస్తులు లేకపోయినా, చేసిన మేలుకు కృతజ్ఞతలు తెలుపుతూ సంస్కారాన్ని చాటుకున్నారు.

విజయమే లక్ష్యంగా ముమ్ముందుకు..



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వార్డు సభ్యుడు ప్రసాద్, అనుచరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- తిమ్మాపురం టీడీపీ వార్డు సభ్యుడు, అనుచరులు వైఎస్సార్ సీపీలో చేరిక

కాకినాడ రూరల్: పాత, కొత్త కలయికతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. తిమ్మాపురం గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, టీడీపీకి చెందిన కాకినాడ ప్రసాద్ ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రసాద్, అనుచరులు గిడితూరు గోవిందు, శివ, నారాయణ, జామి సతీష్, నాని, కొర్రి రామకృష్ణ, తదితర 100 మంది పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో ఆయన నాయకత్వానికి మద్దతుగా నిలిచేందుకు భారీగా చేరుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో తనతో పాటు ఎంపీ అభ్యర్థి సునీల్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమ రథసారథిగా మాటల్లో కాకుండా చేతల్లో చూపిన సీఎం జగన్ మేమంతా సిద్ధం సభకు వస్తున్నందుకు అందరూ హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముద్దన వెంకట్రావు, కాళ్ల చంటి, వెంకటేశ్వరరావు, సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకు అనుమతులు తప్పనిసరి

- కలెక్టర్ నివాస్
- మీడియా సమాచార కేంద్రం ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రం, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జె.నివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు మీడియా సర్టిఫికెట్ నిమిత్తం మీడియా సర్టిఫికేషన్, మోనటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా ముందుగా ఎంసీఎంసీ కేంద్రంలో వివిధ ప్రచారాలకు అవసరమైన ప్రకటనలకు దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత వ్యవధిలో అనుమతులను జారీ చేస్తుందన్నారు. ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ప్రతి ప్రకటనకు ముందస్తు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరన్నారు. అభ్యర్థి ప్రచారం చేసుకునేటప్పుడు కమిటీ ద్వారా విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. వివిధ మాధ్యమాలలో వచ్చే ప్రకటనలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని కలెక్టర్ వివరించారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు అనుమతులకు ఆర్వోల ద్వారా నోటీసులు జారీ చేయిస్తామని కలెక్టర్ నివాస్ తెలిపారు. సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమని, అందువల్ల మీడియా ప్రతినిధులకు ఎన్నికల సమాచారాన్ని సకాలంలో అందించడంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు సఫలీకృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకమన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా మీడియా సహకారంతో విజయవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. మే 13న పోలింగ్ ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత దశలకు సంబంధించి ఎన్నికల సమాచారాన్ని, స్వీప్ కార్యక్రమాల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లను మీడియా బులిటెన్ జారీ చేస్తామన్నారు. మే 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియలో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని కలెక్టర్ నివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో డి.తిప్పేనాయక్, ఎంసీఎంసీ మెంబర్లు కౌడా వీసీ పి.కృష్ణమూర్తి, జేఎన్టీయూ ప్రొఫెసర్ జేవీఆర్ మూర్తి, ఎస్.శివనారాయణరెడ్డి, సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంసీఎంసీ కన్వీనర్ డి. నాగార్జున, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ సిబ్బంది ఏఈఐఈ సి.బాబూరావు, డీఎల్ పీఆర్వో పి.రవి, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్వారంపూడికి సంపూర్ణ మద్దతు

- కుమ్మరి, శాలివాహనుల ఆత్మీయ సమ్మేళనం ప్రకటన
- పాల్గొన్న రాష్ట్ర చైర్మన్ పురుషోత్తం



కుమ్మరి-శాలివాహనుల ఆత్మీయ సమ్మేళనం

కాకినాడ: జిల్లా కుమ్మరి–శాలివాహనుల ఆత్మీయ సమావేశం గురువారం స్థానిక జగన్నాథపురంలో జరిగింది. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మరి-శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్ ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి ఆత్మీయ సమ్మేళనం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కుమ్మరి–శాలివాహనులకు జగన్నాథపురం చిన్నమార్కెట్ సాయిబాబా ఆలయం వద్ద కమ్యూనిటీహాలు నిర్మించారని, మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని, అందువల్ల రానున్న ఎన్నికల్లో ద్వారంపూడికే తమ సంపూర్ణ మద్దతు అని స్పష్టం చేశారు. పురుషోత్తం మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ కుమ్మరి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేస్తే ఆయన తనయుడు జగన్ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చేయూతనిచ్చారన్నారు. అలాగే కుమ్మరి కులంలో జన్మించిన కవయిత్రి మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో ఇచ్చి తమ ఉనికిని కాపాడారన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పసలపూడి ప్రసాదరావు, సంఘసభ్యులు కపిలేశ్వర చంద్రశేఖర్, దాలిపర్తి శ్రీనివాసరావు, కండవల్లి వీరభద్రరావు, దొరబాబు, విశ్వనాథ్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి యోగా శిక్షణ

కాకినాడ: స్థానిక వివేకానందపార్కు ఆవరణలోని రెడ్‌క్రాస్ యోగా కేంద్రంలో వచ్చేనెల 1 నుంచి 16వ తేదీ వరకు వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాలలోపు బాలబాలికల కోసం ఈ శిక్షణా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో పిల్లలకు యోగాసానాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్యనమస్కారాలు, ధార్మిక, నైతిక విలువలు, దేశభక్తి గీతాలు, హస్తకళలు, చేతిరాతలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 96038 81211, 96409 83726 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ముం